ప్రజాశక్తి
బుధవారం 21 జూన్ 2023
5
శ్రీ సత్యసాయి



తాగునీటి కోసం రోడ్డెక్కిన కొట్నూరు వాసులు


ప్రజాశక్తి-హిందూపురం



ఆందోళకు దిగిన కాలనీవాసులు

మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు కొట్నూరులో నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆ ప్రాంత మహిళలు, వృద్ధులు ఖాళీ బిందెలతో 30 నిమిషాలకు పైగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో ఎక్కడిక్కడ వాహనాలు నిలబడిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4 నెలలుగా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ విషయాన్ని స్థానిక కౌన్సిలర్‌కు, అధికారులకు పలుమార్లు చెప్పిన పట్టించుకోలేదన్నారు. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ మల్లికార్జున అక్కడికి వెళ్లి వారికి సర్ది చెప్పడానికి ప్రయత్నం చేయగా వారు కౌన్సిలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వన్ టౌన్ సిఐ ఈరన్న అక్కడికి చేరుకుని సమస్యను తెలుసుకుని, వెంటనే మున్సిపల్ అధికారులను పిలిపించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కనుమరుగవుతున్న పరిశోధనాత్మక జర్నలిజం



సెమినార్‌లో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి గోపాలగౌడ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పోర్తు ఎస్టేట్‌గా చెప్పుకునే మీడియాలోనూ పరిశోధనాత్మకత కథనాలు కన్పించకుండా పోయిన పరిస్థితి ఏర్పడిందని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ గోపాలగౌడ అన్నారు. మోటూరు హనుమంతరావు ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం పుట్టపర్తి పట్టణంలోని జానకిరామయ్య కళ్యాణమంటపంలో మంగళవారం జరిగింది. ప్రజాశక్తి ఎడిటర్ తులసిదాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమ ప్రారంభంలో 'రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాళ్లు-మీడియా పాత్ర' అనే అంశంపై సుప్రీంకోర్టు జడ్జి గోపాలగౌడ ప్రసంగించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా నాడు ఏర్పచుకున్న లక్ష్యాలు చేరుకోవడంలో ఇంకా సుదూరంగానే ఉన్నామని పేర్కొన్నారు. ఇప్పటికీ రాజ్యాంగ ముందు అనేక సవాళ్లు ఉన్నాయన్నారు. మోటూరు హనుమంతరావు లాంటి నాయకులు నేటి తరానికే కాకుండా తనలాంటి వారికి కూడా మార్గదర్శకులని అన్నారు. ఆయన మార్గదర్శకంలోనే ఎస్ఎఫ్ఐ వ్యవస్థాపకుల్లో తాము ఒకరిగా ఉన్నామని గుర్తుకు తెచ్చుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో రూపొందించిన భారత రాజ్యాంగంలో అందరికీ సమానత్వం, సమాన హక్కులు, సమాన అవకాశాలు అన్నది పేర్కొన్నారని అయితే ఇప్పటికీ ఆ లక్ష్యాలు ఏ మేరకు నెరవేరాయన్నది పరిశీలిస్తే చాలా సుదూరంగా ఉన్నామన్నది స్పష్టమవుతోందని అన్నారు. జనాభాలో సగభాగమున్న స్త్రీలకు ఇప్పటికీ సమానత్వం సాధించలేకపోయామని చెప్పారు. చట్టసభల్లో ఇప్పటికీ 25 శాతం సీట్లు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఇందులో న్యాయవ్యవస్థ మినహాయింపు కాదని చెప్పారు. ఎంతోమంది న్యాయవాదులుగా ఉన్నప్పటికీ ఇప్పటికీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ముగ్గురే అయ్యారని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక సమానత్వమూ ఇంకా అందలేదని విచారం వ్యక్తం చేశారు. పోర్తు ఎస్టేట్‌గా చెప్పుకునే మీడియాలోనూ పరిశోధనాత్మకత చచ్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దఎత్తున కార్పొరేట్ ప్రకటనలపై ఆధారపడిన మీడియా అందుకు అనుగుణంగానే వార్తలిస్తోందే తప్ప ప్రజా సమస్యలపై పరిశోధనాత్మకత కథనాలిచ్చే పరిస్థితి లేదని చెప్పారు. దేశంలో 2014 నుంచి 2020 మధ్య మీడియాకు వచ్చిన ప్రకటన విలువ రూ.6500 కోట్లు అని గుర్తు చేశారు. ఇంత పెద్దఎత్తున ప్రకటనలు పొందుతున్న మీడియా వ్యతిరేక కథనాలివ్వగలదా అని ప్రశ్నించారు. అయితే స్వతంత్ర జర్నలిస్టులు కొందరు అక్కడక్కడా ప్రజా సమస్యలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటువంటి జర్నలిస్టులపైనా దాడులు తప్పడం లేదని చెప్పారు. 40 మంది జర్నలిస్టులపై దాడులు జరిగాయని గుర్తు చేశారు. మరోవైపు దేశంలో మత విద్వేషాలు పెరుగుతున్నాయన్నారు. మెజార్టీ, మైనార్టీ అన్న తేడా ఏదీ రాజ్యాంగ పరిధిలో లేదని చెప్పారు. అయితే ఆ పేరుతో ఇప్పుడు దేశంలో రాజకీయం నడుస్తోందన్నారు. ఇటువంటి రాజకీయాలకు స్వస్థి పలికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి అవసరముందని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల కృషి ఎంతగానో ఉందని చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేశారని గుర్తు చేశారు. అటువంటి జర్నలిస్టులకు ఇటువంటి ప్రోత్సహకాలు అందించే కార్యక్రమాన్ని ప్రజాశక్తి నిర్వహించడం అభినందనీయమన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి తరం యువత సమాజం గురించి ఆలోచించడం మానేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష భావజాలమున్న యువత నేడు ఎంతో అవసరమన్నారు. మీడియా నిష్పక్షపాతంగా ప్రజాసమస్యలను వెలికితీయాలని పిలుపునిచ్చారు.

ఎంహెచ్ స్మారకోపన్యాసంలో సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ గోపాల గౌడ



మోటూరు హనుమంతరావు, బొమ్మారెడ్డి చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

అవార్డులు ప్రదానం

మోటూరు హనుమంతరావు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం పుట్టపర్తిలో మంగళవారం ఉదయం జరిగింది. మోటూరు హనుమంతరావు అవార్డును నవభూమి బ్యూరో తుమ్మలపల్లి ప్రసాద్‌కు అందజేశారు. జ్ఞాపికతోపాటు శాలువా కప్పి సత్కరించారు. ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసే విలేకరులకు ఇచ్చే అంతర్గత అవార్డుల ప్రదానోత్సవంలో స్టేట్ బ్యూరో పవన్‌కుమార్, స్టాఫ్ రిపోర్టర్ల విభాగంలో శ్రీనివాసాచారి, మండల విలేకరుల విభాగంలో హిందూపురం విలేకరి షబ్బీర్, ప్రకాశం జిల్లా సింగరాయకొండ విలేకరి రవికుమార్‌కు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజరు అచ్యుతరావు, అవార్డు ఎంపిక కమిటీ ఛైర్మన్ తెలకపల్లి రవి, సభ్యురాలు ప్రొఫెసరు అనిత , ప్రజాశక్తి మేనేజరు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మోటూరు హనుమంతరావు స్మారక అవార్డును అందుకుంటున్న నవభూమి బ్యూరో తుమ్మలపల్లి ప్రసాద్



అవార్డును అందుకుంటున్న ప్రజాశక్తి స్టేట్‌బ్యూరో పవన్‌కుమార్



అవార్డును అందుకుంటున్న ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ శ్రీనివాసాచారి



అవార్డును అందుకుంటున్న ప్రజాశక్తి సింగరాయకొండ విలేకరి రవికుమార్



అవార్డును అందుకుంటున్న ప్రజాశక్తి హిందూపురం విలేకరి షబ్బీర్

జేఈఈ అడ్వాన్స్‌లో సువర్ణ భారతి కళాశాల విద్యార్థుల ప్రతిభ

హిందూపురం : జెఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో పట్టణంలోని సువర్ణ భారతీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దీంతో మంగళవారం కళాశాలలో ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి అధ్యక్షతన విద్యార్థులను ఘనంగా సన్మానించి, నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ లేపాక్షి మండలంలోని విభూతిపల్లి గ్రామానికి చెందిన గోపాల్ కుమారుడు శషాంక్, ముదిరెడ్డిపల్లికి చెందిన శ్రీరాములు కుమారుడు సాయి గణేష్ ఓపెన్ క్యాటగిరీలో మంచి ర్యాంకులు సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ అనిల్, ఉదయ్‌శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలు ఆదాయం పెంచుకోవాలి

ఓబుళదేవరచెరువు: ప్రతి సంఘం ఆదర్శ గ్రామ సంఘంగా ఉండాలని ప్రాజెక్టు డైరెక్టర్, ఎల్‌డిఎం రమణమూర్తి, ఏరియా కోఆర్డినేటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెఎన్ నరసయ్య సూచించారు. స్థానిక డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో మంగళవారం పల్లవి మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘం వంద శాతం అన్ని రకాల అప్పులు రికవరీ చేయాలని, సంఘాల ఆదాయం పెంచుకోవాలన్నారు. అలాగే గ్రామ సంఘం వారీగా, సిబ్బంది వారీగా ప్రాజెక్ట్ అంశాలపై సమీక్ష చేశారు. ఎల్‌డిఎం రమణ మూర్తి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకొన్న రుణాలను వంద శాతం సద్వినియో గం చేసుకోవాలని, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ కోసం తీసుకొన్న రుణాలను వినియోగించాలని తెలిపారు. ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జి సభ్యులకు పిఎంఈజిపి స్కీం ద్వారా మైక్రో ఎంటర్‌ప్రైస్ కోసం రుణాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఏపిఎం రమణప్ప, ఏరియా కోఆర్డినేటర్ రామ్మోహన, మండల సమాఖ్య ఈసీ సభ్యులు, మండల సమాఖ్య లీడర్లు, స్త్రీ నిధి మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

'కుష్టు' నిర్మూలనపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ, గుర్తించు విధానం గురించి వివరించారు. ప్రతి ఇంటినీ తప్పని సరిగా సందర్శించి, ప్రతి ఒక్కరినీ పరీక్షించాలని ఆదేశించారు. ఆడవారికి ఆడవారు, మగ వారికి మగవారు పరీక్షించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. అలాగే ఈ నెల 26 నుంచి జూలై 16 వరకు జరిగే సర్వే కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నాగరాజునాయక్, డాక్టర్ జ్యోత్స్న, సిహెచ్ఓ నగేష్, పిహెచ్‌న్ లలిత కుమారి, సూపర్‌వైజర్లు వెంకటరమణ, సరస్వతమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశా కార్య కర్తలు పాల్గన్నారు.

సోమందేపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యులు నరేష్, హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా వైద్యులు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, కాళ్లు, చేతుల కండరాల బలహీనత, కళ్లు పూర్తిగా మూసుకో లేకపోవడం, తదితర లక్షణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధి వ్యాప్తిని అరికట్టడమే కాకుండా అంగవైకల్యం నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మనోహర్ రెడ్డి, పిహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, సూపర్‌వైజర్లు రవీంద్ర, రత్నమ్మ, ఏఎన్ఎంలు రాజమణి, లక్ష్మీదేవి, ల్యాబ్ అసిస్టెంట్ అనిల్, హెల్త్ అసిస్టెంట్లు సురేష్, పవన్, తిమ్మప్ప, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ వైఎస్ ఛైర్మన్ నాగరాజు రాజీనామా

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపల్ వైస్ ఛైర్మన్ పెనుజూరు నాగరాజు మంగళవారం తన రాజీనామా పత్రాన్ని కమిషనర్ బండిశేషన్నకు అందజేశారు. ముందుగా చేసుకున్న ఏడాది ఒప్పందం ప్రకారమే వైస్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశానని, ఇందులో ఎవరి ఒత్తిళ్లు లేవని నాగరాజు తెలిపారు. ఈయన గతేడాది జూన్ 14న వైస్ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ప్రస్తుతం వైస్‌ఛైర్మన్ రేసులో చెలిమి పెద్దన్న, జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, పురుషోత్తంరెడ్డి ఉన్నట్టు సమాచారం.

అర్ధాంతరంగా ఆగిన జాతీయ రహదారుల నిర్మాణ పనులు

ఇబ్బందుల్లో ప్రయాణికులు



కంకర తేలిన రహదారి

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారపు పనులు అర్ధాంతరంగా ఆగిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి కర్నాటక ప్రాంతం సిర వరకు జాతీయ రహదారి పనులు మంజూరు అయ్యాయి. దీంతో పనులను గుత్తేదారులు ప్రారంభించారు. అయితే నీలకంఠాపురం సమీపంలో దాదాపు కిలోమీటర్ దూరం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు హిందూపురం, పెనుకొండ, అనంతపురం, విజయవాడ, తదితర ప్రాంతాల నుండి కర్నాటక ప్రాంతాలైన, సిరా, తుమ్మకూరు, బెంగళూరు, శివ మొగ్గ, ధర్మస్థలం, మైసూరు వంటి ప్రాంతాలకు ఇదే మార్గాన వాహనాల రాకపోకలు జరుగుతాయి. నీలకంఠాపురం క్రాస్ నుండి, బచ్చలయ్యపాలెం క్రాస్ వరకు, జాతీయ రహదారి పనులు నిలిచి పోవటంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాలలో ప్రమాదాలకు గురవుతున్నారు. అయితే అన్నింటా పనులు పూర్తిచేసిన గుత్తేదారులు మార్గమధ్యంలో అర్ధాంతరంగా పనులు నిలిపివేయడంతో రహదారి కంకర తేలింది. దీంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

చోళ రాజ దండానికి మూలం 'నోలంబ రాజచిహ్నం'

చరిత్రకారుడు మైనాస్వామి

ప్రజాశక్తి మడకశిర రూరల్

చోళ రాజులు చేపట్టిన రాజదండానికి నోలంబ పల్లవ ప్రభువుల రాజ చిహ్నం 'పద్మ నంది' మూలమై వుండవచ్చని చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం మండలం హేమావతి లోని శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన నోలంబ రాజచిహ్నం గురించి వివరించారు.
నోలంబ పల్లవ శిల్పకళపై పరిశోధన చేస్తున్న తాను సిద్ధేశ్వరాలయ స్తంభాల మండపంలో నోలంబుల రాజచిహ్నాన్ని గుర్తించినట్లు చెప్పారు. అగ్రమండపంగా పిలువబడుతున్న స్తంభాల మండపంలో ఉత్తరానికి ఎదురుగా రాజచిహ్నం ఉందన్నారు. వికసించిన పద్మంలో నంది కూర్చొన్న విధంగా శిల్పాన్ని మలిచారన్నారు. నందికి ఆలంబనగా రాజలాంఛనం ఛత్రం (గొడుగు) ఉందని, నందికి ముందు వెనుక మరో రాజలాంఛనం చామరలున్నాయని చెప్పారు. నంది దిగువ కీర్తిముఖం (మొసలితల) వుండగా, అటూ ఇటూ సింహాల సూక్ష్మ శిల్పాలున్నాయని వివరించారు. కీర్తి ముఖం కింద వినాయకుడు, కుమార స్వామి శిల్పాలున్నాయన్నారు.
రాజ చిహ్నం పద్మనంది బొమ్మ నోలంబ పల్లవులు ముద్రించిన బంగారు నాణాల్లో కూడా ఉన్నాయని ఈ బంగారు నాణాలు మ్యూజియంలకే పరిమితమయ్యాయని మైనాస్వామి వివరించారు. చోళులు రూపొందించిన రాజదండం తలభాగంలో పద్మంపై కూర్చొన్న నంది బొమ్మ ఉందనిహేమావతిలోని పద్మ నందికి - రాజ దండంలోని నందికి సమీప సారూప్యతలున్నాయని చెప్పారు. క్రీ.శ. 730 నుంచి క్రీ.శ. 1052 వరకు హేమావతి (హెంజేరు) రాజధానిగా ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, తమిళనాడుల్లోని కొన్ని ప్రాంతాలను నోలంబ పల్లవులు పాలించినట్లు చరిత్ర చెబుతోందన్నారు. గంగ, బాణ, వైదుంబ, చోళ రాజులతో యుద్ధాలు చేస్తూ, సుస్థిర రాజ్యం స్థాపించారన్నారు. అయితే ఒకటో రాజాధి రాజ (1044-1052), తమ్ముడు రెండో రాజేంద్రతో కలిసి వచ్చి నోలంబ, చాళుక్య రాజ్యాలపై దాడి చేసి ఆక్రమించినట్లు చరిత్ర చెబుతోందన్నారు. ఈ సందర్భంగా హేమావతిలోని సుమారు 40 సుందర శిల్ప స్తంభాలను రెండో రాజేంద్ర తరలించుకుపోయి తమిళనాడు తంజావూరు దగ్గరగల తిరువయ్యూరులో ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోందన్నారు. అందుకు సంబంధించిన శాసనాలున్నాయన్నారు. సెంగోల్‌గా ఖ్యాతి గాంచిన రాజదండం చాళుక్యుల శిల్పాల్లో ఉన్న హేమావతి పద్మనంది రాజ చిహ్నంతోనే చోళరాజులు స్ఫూర్తి పొంది రాజదండాన్ని రూపొందించి వుండవచ్చని చరిత్రకారుడు మైనాస్వామి అభిప్రాయ పడ్డారు



రాజచిహ్నాన్ని చూపుతున్న మైనాస్వామి

ఘర్షణలకు టిడిపినే కారణం : వైసిపి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

బత్తలపల్లి: బత్తలపల్లిలో కొందరు స్వార్థపరులు ఘర్షణలకు పాల్పడుతున్నారని, వారి వలలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని వైసిపి నాయకులు ప్రజలకు సూచించారు. పట్టణంలోని ఏపీ కురుబ కారొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు స్వగహంలో మంగళవారం ఎంపిపి బగ్గిరి త్రివేణి, జడ్పీటీసీ కోటి సుధ, వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, మండల కన్వీనర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బత్తలపల్లిలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలకు టిడిపిలోని రెండు వర్గాలే కారణమన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి, కోటి అంటే ఏమిటో ప్రజలకు బాగా తెలుసు అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, వారిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో సర్పంచిలు కాశమ్మ, అక్కిం దామోదర్, ఉప సర్పంచి కోటి గోరీనాథ్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట ఆంజనేయులు, కోఆప్షన్ మెంబర్ కరీం సాబ్, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కదిరి టౌన్: ఉపాధి హామీ చట్టం ద్వారా పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవా లని ఎంపిడిఒ అంజనప్ప సూచించారు. కదిరి రూరల్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ కొత్తపల్లి ఆవాసం జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సక్రమంగా కల్పిస్తున్నారా అని ఆరా తీశారు. అలాగే మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తూ అర్హత ఉన్న రైతులు పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీసులకు ప్రత్యేక శిక్షణ

పెనుకొండ : పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో పెనుకొండ సిఐ కరుణాకర్, ఎస్సై రమేష్‌బాబు పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ శనివారం వరకు జరగనుందని పోలీస్ శిక్షణ అధికారులు శ్రీనివాసులు, ఏఆర్ ఎస్సై శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ దాదాపీర తెలిపారు. శిక్షణలో విచ్ఛిన్నకర శక్తులను చెదరగొట్టడం, శాంతి భద్రతలు నెలకొల్పడం, అసాంఘిక శక్తుల నియంత్రణ, తదితర అంశాలపైప పోలీసులకు మెలకువలు నేర్పించారు. అనంతరం తుపాకీ పేల్చడం, లాఠీచార్జి చేయడం, భాష్పవాయువు ప్రయోగించడం, తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ' యాత్ర విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-రొద్దం

టిడిపి మినీ మేనిఫెస్టోని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు 'భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో పెనుకొండ నియోజకవర్గంలో జరిగే యాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆర్.మరవపల్లి గ్రామంలో మంగళవారం ఆయన తన నివాసంలో పార్టీ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి విజయం కోసం మనస్పర్థలు, గ్రూపులు వీడి ప్రతి ఒక్కరూ శక్తి వంఛన లేకుండా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, మహిళా ఉపాధ్యక్షురాలు నీలావతమ్మ, మండల కన్వీనర్లు నరహరి, సర్పంచిలు నాగరాజు, మంజునాథ్, నాయకులు అశ్వర్థనారాయణ, హరీష్, మురళి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో సంగా సుధాకర్...

పుట్టపర్తి రూరల్: టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో మంగళవారం టిడిపి నాయకులు సంగా సుధాకర్ పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గం రాపూర్ వద్ద జరుగుతున్న యువగళం పాదయాత్రలో లోకేష్ వెంట సంగా సుధాకర్ అడుగులో అడిగేసి నడిచారు. ఈ సందర్భంగా సుధాకర్ జిల్లాలో టిడిపి పరిస్థితి, ముఖ్యంగా పుట్టపర్తి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలపై 15 నిమిషాల సేపు చర్చించినట్లు తెలిసింది.

ఎంహెచ్ స్మారక అవార్డుల ప్రదానోత్సవ దృశ్య మాలిక



ఎంహెచ్‌అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న అవార్డుల ఎన్నిక కమిటీ ఛైర్మన్ తెలకపల్లి రవి, ఎమ్మెల్యే దుద్దుకుంట, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

జడ్జిని సన్మానిస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, మేనేజర్ వేణుగోపాల్ సిబ్బంది



ఎంహెచ్‌అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరైన ప్రజాశక్తి సిబ్బంది, అభిమానులు





ప్రజాశక్తి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జడ్పీ ఛైర్స్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అవార్డుల ఎన్నిక కమిటీ ఛైర్మన్ తెలకపల్లి రవి, ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, మేనేజర్ వేణుగోపాల్

ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా పాటించాలి

జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, ఆదేశాలను పక్కాగా పాటించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమ్మర్ డివిజన్-2024పై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఈడీటీలు, ఈఎస్ఏలు, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లు, బిఎస్ఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు ప్రివియన్ కార్యక్రమాలను సకాలంలో పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇవ్వడం, ప్రతి ఫారం గురించి తెలుసుకోవడం, మార్పులు, చేర్పులు, తొలగింపులు పూర్తి చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి తప్పులు లేకుండా తహశీల్దార్లు, సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎన్నికల అసిస్టెంట్లు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు అన్ని విషయాలు తెలుసుకొని ఇంటింటి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ధ్రువీకరణ చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌నీ తనిఖీ చేసి ఓటరుకు అందుబాటులో ఉండి ఓటు వేసేలా చూడాలన్నారు. ప్రజల నుంచి ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాకుండా మార్పులు, చేర్పులు చేపట్టాలన్నారు. ఫారం-13, 14 నోటిఫికేషన్ నోటీసులు ఇచ్చి నిర్ధారణ చేసుకున్న తర్వాత మాత్రమే తొలగింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఓటరు నమోదులో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గవద్దన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయాలి : పరిటాల సునీత

ప్రజాశక్తి-కనగానపల్లి

రాప్తాడు నియోజకవర్గంలో టిడిపి హయాంలో చేసిన అభివృద్ధితో పాటు, నాలుగేళ్ల వైసిపి పాలనలో జరిగిన దౌర్జన్యాలు, దాని వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బస్సు యాత్ర ద్వారా అందరికీ చెబుదామని మాజీ మంత్రి పరిటాల సునీత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే బస్సుయాత్ర 29వ తేదీ రాప్తాడు నియోజకవర్గంలో ప్రవేశించనుంది. ఇందుకు సంబంధించి మంగళవారం మాజీ మంత్రి పరిటాల సునీత కనగానపల్లి పార్టీ కార్యాలయంలో నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందు బస్సు యాత్ర రూట్ మ్యాప్‌ను నాయకులకు వివరించారు. అనంతరం ఆమె



కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిటాల సునీత

సిఎస్.కోట గ్రామం వెళ్లి రోజమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే సుగుణమ్మను కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, సీనియర్ నాయకులు ముకుందనాయుడు, సుధాకర్‌చౌదరి, పూజారి రాజకృష్ణ, మాధవరాజు ఉన్నారు.

బాధితులకు 'కందికుంట' పరామర్శ

తనకల్లు : కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఆయన తొలుత మండల పరిధిలోని ఈతోడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం బైక్‌పై నుంచి పడి ఇంటి వద్దే చికిత్స పొందుతున్న బాలసముద్రం గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్బయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని గొల్లవారిపల్లి గ్రామానికి చెందిన కనుగొండ శంకరరెడ్డితో పాటు అతడి బంధువులు, అనుచరుల 20 కుటుంబాలు కందికుంట ఆధ్వర్యంలో టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సోంపాళ్యం నాగభూషణం, రాజారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాధవరెడ్డి, సుధాకర్, ఎస్సీ సెల్ చిన్నప్ప, బిసి సెల్ శంకర్‌నాయుడు, సరోజమ్మతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కందికుంట

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మేడాపురం గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుతో చుట్టుపక్కల ఉండే ఫీడర్లపై లోడు తగ్గి మండలం అంతా విద్యుత్ కష్టాలు తొలగిపోతాయని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయానికి 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఆయన మంగళవారం అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షుడు పైలా నరసింహ య్యతో కలిసి మేడాపురంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 1400 మంది రైతుల విద్యుత్ కష్టాలను కడతేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 1800 ఇళ్లకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ఉచితంగా ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాప్తాడు నియోజక వర్గంలోని కొడిమి, ఆలమూరు, కుంటిమద్ది, మేడాపురం, ఉప్పరపల్లికి సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి, ఇవన్నీ ఏడాదిలోగా పూర్తవుతామన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకుండా భవిష్యత్తులో మరిన్ని సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాసేవలో కోట్లాది రూపాయలు ఖర్చు చేశానన్నారు. ఎన్నికల హామీ మేరకు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం, రానున్న రోజుల్లో ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తా అన్నారు. బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేయిస్తామని మాటిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచిలు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, వార్డ్ మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వికలాంగుడి దాతృత్వం

సోమందేపల్లి : సోమందేపల్లికి చెందిన వికలాంగుడు వినోద్ తను శ్రమించి కొనుగోలు చేసిన మూడు చక్రాల వాహనాన్ని మరో వికలాంగుడికి ఉచితంగా అందజేసి దాతృత్వం చాటుకున్నాడు. వివరాలు.. వినోద్‌కు కాలు లేకపోయినా ఫ్లెక్సీ సెంటర్ నడుపుతూ స్వశక్తితో జీవిస్తున్నాడు. వారం క్రితం అతడికి రాష్ట్ర ప్రభుత్వం మూడు చక్రాల బండిని ఉచితంగా అందజేసింది. దీంతో రూ. లక్ష పైబడి కొనుగోలు చేసిన తన మూడు చక్రాల వాహనాన్ని అనంతపురం నగరంలో ఆర్టీవో కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న మరో వికలాంగుడు శ్రీనివాసులుకు ఉచితంగా అందజేశాడు. శ్రీనివాసులు మాట్లాడుతూ తాను ఆర్థిక ఇబ్బందులతో బండి కొనలేకపోయానని, వినోద్ అతని బండిని నాకు ఉచితంగా అందజేసినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రజలను భయపెట్టడమే వైసీపీ లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

బత్తలపల్లిలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా వైసీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విమర్శించారు. బత్తలపల్లిలో జరిగిన సంఘటనలను మంగళవారం ఆయన ధర్మవరం డీస్పీ శ్రీనివాసులను కలిసి వివరించారు. బత్తలపల్లి ఘర్షణల్లో అధికార పార్టీ నాయకుల హస్తం ఉందని, అందులో బత్తలపల్లి ఎస్ఐ శ్రీహర్ష ఏకపక్షంగా వ్యహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం గోనుగుంట్ల సూర్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ బత్తలపల్లిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కోటి సూర్యప్రకాశ్ బాబు, ఎస్ఐ శ్రీహర్ష ప్రజలను రెచ్చగొట్టి హత్యారాజకీయాలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట నాయకులు డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, చిలకం సూర్యనారాయణరెడ్డి, బోడగల గిరిధర్ ఉన్నారు. అలాగే పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ



విలేకరులతో మాట్లాడుతున్న గోనుగుంట్ల

పట్టణంలో ప్లంబర్లు, భవన నిర్మాణ కార్మికులు, ఎలక్ట్రీషియన్స్‌కు సంబంధించి డబ్బులు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేయిస్తామని వైసిపి దళారులు చెప్పుతున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డిపై ఎస్పీకి ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్: ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న ఆగడాలపై మంగళవారం మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ ఎస్పీ మాధవరెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రతిపక్షాల్లో చురుగ్గా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని అధికార పార్టీ నేతలు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. బత్తలపల్లి మండలంలో చిన్న గొడవ జరిగితే స్థానిక ఎస్సై బాధితులపై ఏకపక్షంగా అక్రమ కేసులు బనాయించారన్నారు. బత్తలపల్లి మండలంలో జరిగిన హత్యల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి, కోటి బాబు, స్థానిక ఎస్సై పాత్ర ఉందని, దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాల ఆయన ఎస్పీని కోరారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కదిరి టౌన్

చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని నాబార్డ్ జిల్లా మేనేజర్ అనురాధ పేర్కొన్నారు. ఎల్ఇడిపి ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందిన మహిళలతో మంగళవారం కదిరి రెడ్స్ సంస్థ రీసోర్స్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాబార్డ్ జిల్లా మేనేజర్ అనురాధ, కదిరి కెనరా బ్యాంకు మేనేజర్ మధుసూదన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్స్ అధ్యక్షురాలు భానూజ మాట్లాడుతూ నాబార్డ్ సహకా రంతో 90 మంది మహిళలకు 15 రోజుల పాటు చిరుధాన్యాలతో వంటల తయారీపై శిక్షణ ఇచ్చామన్నారు. వారు ప్రస్తుతం సొంతంగా చిరు ధాన్యాలతో వంటలు చేస్తూ మార్కె టింగ్ చేస్తున్నారన్నారు. నాబార్డ్ జిల్లా మేనేజర్ మాట్లాడుతూ మహిళలు సొంతంగా వ్యాపారవేత్తలు గా ఎదగాలనే ఉద్దేశంతో శిక్షణ ఇచ్చామని, వీరికి బ్యాంకు రుణాలు ఇప్పించడం వల్ల సొంతం గా యూనిట్స్ ఏర్పాటు చేసుకుని పదార్థాలు తయారు చేసి మార్కెట్ చేయడం అభినందనీయమన్నారు. కెనరా బ్యాంకు మేనేజర్ మధుసూదన్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జిలను ప్రోత్స హిస్తామని తెలిపారు. అనంతరం మిల్లెట్స్ ప్రాసెస్, మిషెన్స్, శిక్షణ పొందిన వారు తయారు చేసిన వంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రెడ్స్ కోఆర్డినేటర్ ఎల్లప్ప, సిబ్బంది శారద, మెహతాజ్ , గంగులప్ప పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శంకర నారాయణ పేర్కొన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ మంగమ్మ ఆధ్వర్యంలో సర్పంచి చాపట్ల మణిశివశంకర్‌రెడ్డి, ఉపసర్పంచి రాజా, ఎంపిటిసి సిరగం శ్రీనివాస్‌రెడ్డి మండల పరిధిలోని ఎముకుల గుట్టపల్లి, చొండూరు వాండ్లపల్లి, యర్రయ్యగారిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గజమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎముకల గుట్టపల్లి ప్రజలు వైద్యం కోసం గోరంట్ల పిహెచ్‌సికి వెళ్తే కొండాపురం వెళ్లాలని, పశువైద్యశాలకు వెళ్తే వాన వోలు వెళ్లాలని చెబుతున్నారని ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, జడ్పిటిసి పాలే జయరాం నాయక్, పట్టణ కన్వీనర్ ధనంజయరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, సచివాలయం కన్వీనర్ సమరసింహారెడ్డి, సర్పంచిలు సరోజ నాగే నాయక్, ఉపసర్పంచి రాజారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ వార్డు మెంబర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అంగన్‌వాడీల రూపురేఖలు మారుస్తాం..

'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలను మారుస్తున్నట్లు ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం ఎర్రయ్యగారిపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రీ స్కూల్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే కొత్తగా నమోదు చేసుకున్న విద్యార్థులకు ప్రీ స్కూల్ కిట్లు, బొమ్మలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి మనీ శివశంకర్ రెడ్డి, ప్రమీల మూర్తి, ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి,



ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

అంగన్‌వాడీ కార్యకర్త నంజమ్మ, పాల్గొన్నారు.

అమరాపురం : రాష్ట్రాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవగానిపల్లి గ్రామంలో మంగళవారం సర్పంచి గిరిజ సదానంద్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నేతృత్వంలో సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే అందజేస్తున్నామన్నారు. ప్రజలు మరోమారు వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మునిస్వామి, ఎంపిపి ఈరన్న, వైస్ ఎంపిపిలు లలితమ్మ, కృష్ణమూర్తి, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, ఎంపిటిసిలు రాజు, నారాయణ గౌడ్, వైసిపి నాయకులు రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని రంగేగౌడ్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

రైల్వే అండర్ బ్రిడ్జి పనులు అడ్డగింత

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల పరిధిలోని జోగన్నపేట రైల్వే గేట్ వద్ద చేపట్టిన అండర్ బ్రిడ్జి నిర్మాణం పనుల ను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే జోగన్నపేట, బొమ్మిరెడ్డిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ గ్రామాలకు రహదారి సౌకర్యం కోల్పోతామని పేర్కొన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు వినతిపత్రం పంపామని, ఆయన ఇక్కడ రైల్వే గేట్‌ను పరిశీలించి ఫ్లైఓవర్ బ్రిడ్జి కానీ, గ్రామాలకు రహదారి సౌకర్యం కోల్పోకుండా మరోచోట అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీనాథ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

రొద్దం : 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి జడ్పీ హైస్కూల్‌లో ముఖ్య అతిథి ఎంపిపి చంద్రశేఖర్ పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, మెడల్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెట్టి మారుతిరెడ్డి, స్కూల్ కమిటీ ఛైర్మన్ విష్ణు, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి కూలీ ఆత్మహత్య

ధర్మవరం టౌన్: పట్టణ సమీపంలోని తిక్కస్వామిగుడి సమీపంలో ఓ కూలీ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వేపోలీసులు తెలిపారు. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన సాకే నాగరాజు(40) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రెండేళ్ల క్రితం భార్య నాగేంద్రమ్మతో గొడవపడి వేరుగా జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానికావడంతో పాటు ఒంటరితనాన్ని భరించలేక జీవితంపై విరక్తి చెంది రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నాగరాజుకి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మవరం టౌన్: పట్టణ శివారులోని పాతమసీదు వద్ద మంగళవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తిరుపాల్, కాంతమ్మ ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి చిగిచెర్ల మీదుగా ధర్మవరం వస్తుండగా పట్టణ శివారులోని గూడ్స్ షెడ్ కొట్టాల సమీపంలో పాతమసీదు వద్ద శాంతినగర్ వైపు నుంచి గొల్లపల్లి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

హిందూపురం : స్థానిక సుగూరు సప్పలమ్మ ఆలయ సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థాఇనక అంబేద్కర్‌నగర్‌కు చెందిన రామాంజి, సురేష్ ద్విచక్ర వాహనంపై పోచనపల్లి వైపు వెళ్తుండగా పోచనపల్లి నుంచి పట్టణంలోకి వస్తున్న ఆటో ఢీకొని వెళ్లి పోయింది. స్థానికులు ఫోన్ చేయగా 108 సిబ్బంది వారిని జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్నాటక మద్యం పట్టివేత

రొద్దం : మండల పరిధిలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప తన ఇంట్లో కర్నాటక మద్యం అమ్ముతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగస్వామి మంగళవారం సిబ్బందితో వెళ్లి కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

రొద్దం : మండల పరిధిలోని ఎం.కొత్తపల్లి గ్రామంలో సోమవారం రాత్రి బోయ మారుతి(36) మృతి చెందాడు. ఆ సంఘటనకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగ స్వామి తెలిపారు. అలాగే మంగళవారం ఉదయం పెనుగొండ డిఎస్పి హుస్సేన్‌పీరా, సీఐ కరుణాకర్, రొద్దం ఎస్ఐ నాగస్వామి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అదే గ్రామానికి చెందిన హనుమంతు, మల్లయ్య, నారాయణస్వామిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

పెనుకొండ: టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్ ద్వారా ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాధవనాయుడు, డివి ఆంజనేయులు, మావటూరు గోపాల్, త్రివేంద్రనాయుడు, కోనాపురం కేశవయ్య, మైలారప్ప, కౌన్సిలర్ గీతాహనుమంతు, మారుతిప్రసాద్, వాసుదేవరెడ్డి, బాలాజీనాయక్, నరేష్, మద్దిలేటి, హేమంత్, రమేష్, మంజు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

గాండ్లపెంట : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు టి.జ్యోతిశ్రీ, ఎస్.హఫీజ్, సాదియాలకు మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్ అలీ, జెసిఎస్ రవీంద్రారెడ్డి సత్కరించి నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దా రన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణనాయక్, హెచ్‌ఎం మధురాజు, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్, చిన్నప్పయ్య, గంగాధర్, హర్షత్‌రాయుడు, సిద్ధారెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్సుయాత్రపై నేడు సమావేశం

మడకశిర: టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరన్న కోరారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న బస్సుయాత్రకు సంబంధించి పట్టణంలో బుధవారం(నేడు) సమావేశం నిర్వహిస్తామని, కావున నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు విధిగా హాజరవ్వాలని ఆయన సూచించారు.

గ్రంథాలయాల తనిఖీ

తనకల్లు : స్థానిక గ్రంథాలయాన్ని మంగళవారం అనంతపురం జిల్లా గ్రంథాలయ అధికారిణి పి.రమ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సమయంలో గ్రంథాలయంలో అధికారి ఎస్. మస్తాన్ వలి ఉన్నారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి గ్రంథాలయాన్ని జిల్లా అధికారిణి పి.రమ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠకుల హాజరు పట్టిక, పుస్తకాలు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.లక్ష్మీనాయక్, పాఠకులు పాల్గొన్నారు.

సమ్మర్‌క్యాంప్ సర్టిఫికెట్లు అందజేత

చిలమత్తూరు: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వేసవి కాలంలో నిర్వహించిన ఫుట్‌బాల్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు మంగళవారం స్థానిక గ్రీన్ గ్రౌండ్‌లో ఎస్ఐ శ్రీనివాసులు సర్టిఫికెట్లు అందజేశారు. వేసవి సెలవుల్లో 60 మంది శిక్షణ పొందారు. కార్యక్రమంలో డిఎస్‌వో, ఆర్టీటీ కోఆర్డినేటర్ దాదాకలందర్, కిశోర్, గోగ్రీన్ బాలాజీ, సనావుల్లా, సలీం, ఆతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

పెనుకొండ : ఉపాధ్యాయుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌సి-2 ఎం.సుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని బోయపేట ఎంఆర్‌సిలో మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్‌సి-1 గంగప్ప అధ్యక్షతన ఎం.సుధాకర్ పరిచయ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి, రమేష్, రవీంద్రనాథ్, కృష్ణానాయక్, నరేష్, ఉపేంద్ర, రామాంజనేయులు, ఆది, జెసిఎస్, నాగేశ్వర రెడ్డి, పెద్దరాజు, రాజశేఖర్, రాజగోపాల్, ప్రమీలమ్మ, హసీనబేగం, నాగమణి, రాధామణి, సంధ్యారాణి, నాగేంద్ర పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంఇఓ

ఓబులదేవరచెరువు : మండల రెండవ విద్యాశాఖ అధికారిగా మంగళవారం జె.రమణ స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల వ్యాప్తంగా ఉపాధ్యాయులు సమస్యలను తెలుసుకుని సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

గాండ్లపెంట: స్థానిక ఎంఆర్‌సి భవన్‌లో మంగళవారం ఎంఈఓ కృష్ణానాయక్ సమక్షంలో ఎంఈఓ-2గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన పదోన్నత బదిలీల్లో భాగంగా శ్రీనివాసులు ఓడిసి మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఆపరేటర్, సీఆర్పీలు, ఎంఆర్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొనేలా చర్యలు చేపట్టాలి

హిందూపురం : మణిపూర్‌లో శాంతి నెలకొనేలా చర్యలు చేపట్టాలని క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు కోరారు. పట్టణంలోని సిఆర్‌సి ఎమ్‌ఎస్ మిషన్ చర్చిలో మంగళవారం ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 27వ వార్షికోత్సవ వేడుకలు ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. నాగేంద్ర కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత విద్వేషాలు రెచ్చగొడుతున్న వారిని కట్టడి చేయాలన్నారు.